

## రోడ్డు ప్రమాదం ఆటో డ్రైవర్ మృతి

**జమ్మికుంట. (ఏప్రిల్ 02) విజన్ ఆంధ్ర :**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆటో బోల్తాపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తేలుకుంట్ల శ్రీనివాస్(38) అనే వ్యక్తి తన ఆటోలో కూలీలను తీసుకొని ఇల్లందకుంట లో దింపాడు. తిరిగి స్వగ్రామం పోతిరెడ్డిపల్లి కి వెళుతుండగా పెద్దపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పడంతో బోల్తా పడి తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

కరీంనగర్ విజన్

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 03 ఏప్రిల్ 2026 పేజీలు 8-10




## నా పేరు చెప్పి....

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తన పేరు చెప్పుకుని కబ్జాలు, అక్రమ దందాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు. ఎవరైనా తన పేరు ఉపయోగించి సెటిల్మెంట్లు, పైరవీలు చేస్తూ ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే పైరవీకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానం వచ్చిన వెంటనే ఎంపీ కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

**రవిందర్,**
**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో,విజన్ ఆంధ్ర:**

## కబ్జాలు, దందాలు చేస్తే చర్యలు తప్పవు



### నేను బతికుండగా..

## డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను

- ఏప్రిల్ 7, 8 తేదీల్లో దీక్ష చేస్తా
- రాజకీయాలకు అతీతంగా ఉద్యమిద్దాం
- 3న బంద్ విజయవంతం చేయండి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి


2 లో


**విజన్ ఆంధ్ర,హుజురాబాద్ (ఏప్రిల్ 02)**

తాను బతికుండగా ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డ్ పెట్టనిచ్చే ప్రసక్తి లేదని, ఎంతవరకైనా పోరాటానికి సిద్ధమని, ప్రభుత్వ వెంటనే డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా డంపింగ్ యార్డ్ పై ఉద్యమించాలని, ఈ నెల3న జరిగే హుజురాబాద్ బంద్ విజయవంతం చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిర్పపల్లి సమీపంలోని డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని బి ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులు, నేతలతో కలిసి పరిశీలించారు.

## కొండగట్టున భక్తి సాగరం

### చిన్న హనుమాన్ జయంతి వేడుకలకు పోటెత్తిన భక్తజనం!

మల్యాల, ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర):

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో చిన్న హనుమాన్ జయంతి వేడుకలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి నుండే భక్తుల తాకిడి విపరీతంగా పెరగడంతో కొండగట్టు పరిసరాలన్నీ భక్తజన సంద్రమయ్యాయి. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మరియు ఆలయ ఈవో స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ బుధవారం రాత్రి నుండి కొండపైనే ఉండి క్యూలైన్లు, మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో ఆయన స్వయంగా మాట్లాడి, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా తాగునీటి కొరత రాకూడదని, ప్రసాద కౌంటర్లు నిరంతరాయంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు మరోవైపు జిల్లా ఎస్పీ బందోబస్తును కట్టుదిట్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా తలనీలాల దగ్గర, మాల విరమణ ప్రాంతాల్లో తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక బలగాలను మోహరించారు. సిసి కెమెరాల ద్వారా రద్దీని గమనిస్తూ, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు



తీసుకుంటున్నారు. సమర్థవంతంగా ఆలయ ఈవో క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయపరుస్తూ దర్శనం త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నారు.

# నేను బతికుండగా.. డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను

మొదటిపేజీ తరువాయి

- ఏప్రిల్ 7, 8 తేదీల్లో దీక్ష చేస్తా
- రాజకీయాలకు అతీతంగా ఉద్యమిద్దాం
- 3న బంద్ విజయవంతం చేయండి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**విజన్ ఆంధ్ర,హుజురాబాద్ (ఏప్రిల్ 02)**

తాను బతికుండగా ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డ్ పెట్టనిచ్చే ప్రసక్తి లేదని, ఎంతవరకైనా పోరాటానికి సిద్ధమని, ప్రభుత్వ వెంటనే డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా డంపింగ్ యార్డ్ పై ఉద్యమించాలని, ఈ నెల3న జరిగే హుజురాబాద్ బంద్ విజయవంతం చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిర్సపల్లి సమీపంలోని డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని బి ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులు, నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని, ఇది ప్రజల జీవిత సమస్య అని, నిజంగానే ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటయితే ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టమవుతుందని, రైతులు మహిళలు పిల్లలు ఇబ్బందులు పడతారని, పశుపక్షాదుల ఉనికి సైతం ప్రశ్నార్థకమవుతుందని పర్యావరణం దెబ్బతింటుందని, ప్రజలు ముక్తకంఠంతో డంపింగ్ యార్డ్ వద్దని కోరుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కి డంపింగ్ యార్డ్ వద్దని, హుజురాబాద్ ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని దండం పెట్టి చెప్పానని ఆయన తెలిపారు. "నాపైకోపం ఉంటే నన్ను ఉరి తీయండి.. జైలుకు పంపండి.. కానీ నా



నియోజకవర్గ ప్రజలను ఇబ్బంది పెట్టద్దు.. హుజురాబాద్ గడ్డ పోరాటాల అడ్డ.. నాడు తెలంగాణ రాష్ట్ర సాధనలో హుజురాబాద్ కమలాపూర్ ప్రాంతం కీలకపాత్ర పోషించింది.. ఈ ప్రాంతానికి పోరాటాలు కొత్త కాదు" అని ఆయన ఉద్వేగంగా అన్నారు. డంపింగ్ యార్డ్ వ్యవహారంలో ఎవరు బురద చల్లేందుకు ప్రయత్నించవద్దని, స్వయంగా ముఖ్యమంత్రి డంపింగ్ యార్డ్ ను ప్రతిపాదించారని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఆయన ఈ సందర్భంగా చదివి వినిపించారు. డంపింగ్ యార్డ్ రద్దు విషయంపై తాను ముఖ్యమంత్రికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు లేఖలు ఇప్పటికే రాసినట్టు ఆయన వివరించారు.

**– 7, 8 తేదీల్లో దీక్ష చేస్తా**

డంపింగ్ యార్ హుజురాబాద్ ప్రజలందరి జీవన్మరణ సమస్య అని, ఒకవేళ ప్రభుత్వం ప్రకటనను వెనక్కి తీసుకోకపోతే, డంపింగ్ యార్డ్ ను రద్దు చేయకపోతే తాను ఈ నెల 7, 8 తేదీలలో స్వయంగా జేఏసీ శిబిరంలో దీక్షలో పాల్గొంటానని, 7 న ఉదయం 7 గంటల నుండి 7 వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు దీక్ష చేస్తానని అయన వెల్లడించారు. ఆ లోపే ప్రభుత్వం నుండి అనుకూలమైన ప్రకటన వస్తుందని ఆశిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

**3 న బంద్ విజయవంతం చేయండి**

బందును అడ్డుకోవాలని పోలీసు అధికారులు ప్రయత్నం చేయవద్దని, పోలీసులు వందలాది మంది ఉంటే హుజురాబాద్ లో లక్ష మంది ప్రజలు ఉన్నారని, ప్రజా పోరాటాన్ని ఎవరు ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. హుజురాబాద్లో మూడో తేదీన బంద్ శాంతియుతంగా జరుగుతుందని బంద్ విషయాన్ని పోలీసు అధికారులతో కూడా చర్చించి సహకరించాలని కోరానని, డంపింగ్ యార్డ్ ఏర్పాటయితే పోలీసులకు కూడా ఇబ్బంది జరుగుతుందని ఆయన అన్నారు. బి ఆర్ ఎస్ కాంగ్రెస్ బిజెపి సిపిఐ సిపిఎం తో పాటు అన్ని పార్టీలు స్వచ్ఛంద సంస్థలు అన్ని వర్గాలు బందులో పాల్గొనాలని, ప్రజలు డంపింగ్ యార్డ్ అంశంపై సీరియస్ గా ఉన్నారన్న సంకేతం ప్రభుత్వానికి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. హుజురాబాద్ బంద్ విషయమై ఇప్పటికే వ్యాపార వర్గాలతో తాను చర్చించానని, అత్యవసర సేవలైన దవాఖానాలు మెడికల్ షాపులు తప్ప మిగతావి అన్ని బంద్ పాటించాలని, అందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజానికి నాలుగో తేదీన బంద్ పట్టిద్దామని అనుకున్నామని కానీ తనను సిఐడి విచారణకు హాజరుకావాలని చెప్పినందున చట్టాన్ని గౌరవించే ఉద్దేశంతో తాను మూడో తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**- టెండర్లు వేయొద్దు**

డంపింగ్ యార్డ్ కం ఎనర్జీ ప్లాంట్ కాంట్రాక్ట్ పనులకు ఏవి కూడా టెండర్ వెయ్యొద్దని, వేస్తే తప్పకుండా అడ్డుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ జవహర్ నగర్ లోనూ ఇలాగే ప్లాంట్ పెడితే ప్రస్తుతం అక్కడ జనాలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని స్వయంగా అందరూ చూస్తున్నారని, ఎమ్మెల్యే మల్లారెడ్డి కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులు చెప్పారని, అక్కడ ప్రస్తుతం ఏమీ చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు.

## ప్రధానితో బండి సంజయ్ భేటీ

- **కరీంనగర్ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం చేసుకోవడంపట్ల మోదీ సంతోషం**
- **అట్టడుగు వర్గాలకు కేంద్ర సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సూచన**

**కరీంనగర్ బ్యూరో: విజన్ ఆంధ్ర**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా వీరి మధ్య ప్రస్తావనకు రాగా ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కేంద్ర నిధులు, అభివృద్ధి నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లామని విషయాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ మోదీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతోపాటు "మోదీ గిఫ్ట్" పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన అంశాన్ని ప్రస్తావించారు. నూతనంగా గెలిచిన కరీంనగర్ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల పక్షాన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని "ప్రజలకు నిరంతరం సేవ చేయడంలోనే తృప్తి ఉంటుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయండి. అట్టడుగు వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో నిర్విరామంగా పనిచేయండి"అని సూచించారు



## జై భీమ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**కరీంనగర్ బ్యూరో: విజన్ ఆంధ్ర**

ఏప్రిల్ మాసం అంటేనే మహనీయులు జన్మించిన పవిత్ర మాసం అని అన్నారు. మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్. మాజీ ఎంపీ వినోద్ కుమార్ లు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం రోజున కరీంనగర్లోని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్న భీమ్ యాత్ర పోస్టర్ ను వారు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏప్రిల్ మాసంలో మహనీయులైనటువంటి బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిభాపులే, బాబు జగ్జీవన్ రామ్ లాంటి మహానుభావులు జన్మించిన పవిత్ర మాసం అని కులమతాలకతీతంగా గొప్పగా ప్రజలందరూ వారి జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా.. జరుపుకుంటారని.. వారి ఆశయాలకనుగుణంగా నేటి యువత ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ యూత్ అధ్వర్యంలో. గత ఐదు ఏళ్లుగా అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని నగరంలోని కిసాన్ నగర్ నుండి కోర్ట్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టే యాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములై యాత్రను విజయవంతం చేయాలన్నారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే భారత రాజ్యాంగం పటిష్ట స్థితిలో ఉండడానికి కారణం డా బి ఆర్ అంబేద్కర్ అని వారి కృషి తోనే దేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో



నాయకులను ఎన్నుకోగలుతున్నామన్నారు. మన రాజ్యాంగాన్ని చూసి పలు దేశాలు వాటి రాజ్యాంగాన్ని రచించుకున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14న సాయంత్రం జరిగే జై భీమ్ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు,నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్,కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్,మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు మిడిదొడ్డి నవీన్, అంబేద్కర్ యూత్ సభ్యులు కొమ్ముల కరుణాకర్, లింగంపెల్లి రాజేష్, పులిపాక సాయికుమార్, కళ్ళపెల్లి నవీన్ , గసికంటి దీపక్, బోనా సాగర్, మల్యాల కిరణ్, వేదిర వామన్, దాసరపు వంశీ ప్రణయ్, మడక అరవింద్, తదితరులు పాల్గొన్నారు

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
శుక్రవారం, 03.04. 2026

## వీ-హబ్ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**ముత్తారం,పెద్దపల్లి, ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర)**

వీ-హబ్ నైపుణ్యాల శిక్షణా కేంద్రాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.గురువారం నిర్వహించిన టీఓటీ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని,స్వశక్తి సంఘాల మహిళలు నైపుణ్యాలు పెంచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అన్నారు. మహిళలకు వ్యాపార నిర్వహణ, బ్రాండింగ్,రుణాల పొందుపై సమగ్ర శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.జిల్లాలోని వీ-హబ్ కేంద్రాన్ని ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ కాలిందిని,అదనపు డిఆర్డిఓ బి. రవీందర్,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, వీ-హబ్ డైరెక్టర్ జైహింద్, అసోసియేట్ డైరెక్టర్ ఉష, ప్రోగ్రాం మేనేజర్లు తాజ్,అబిద్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో అధికారులను నిలదీసిన

**-బిఆర్ఎస్ నాయకులు బండారి శ్రీనివాస్**

**వేములవాడ ఆర్సి ఏప్రిల్ 2 (విజన్ ఆంధ్ర)**





సంకేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రైతు భరోసా నిధులు ఆలస్యంగా జమ కావడం, అలాగే ఇందిరమ్మ చీరెల పంపిణీలో జరిగిన అవ్యవస్థపై ప్రజా పాలన కార్యక్రమంలో సమస్యలపై అధికారులను నిలదీసిన బిఆర్ఎస్ నాయకుడు బండారి శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో సమయానికి జమ కావడం లేదని అన్నారు. రైతులు ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వం ఇలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైంది కాదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడే బస్సులను నడపక ప్రయాణికులను గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి తీసుకొచ్చారని తన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరైన కరంట్ ఇవడం లేదని, అలాగే సంకేపల్లి గ్రామంలో 800 మంది మహిళలకు ఇందిరమ్మ చీరెలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 495 మంది మహిళలకు మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. మిగతా మహిళలకు ఇప్పటివరకు చీరెలు ఇవ్వకపోవడం దురదృష్టకరమని, అందరికీ సమానంగా అందాల్సిన సంక్షేమ పథకాలు ఇలా మధ్యలోనే ఆగిపోవడం ప్రజలలో అసంతృప్తిని కలిగిస్తోందని, ఇదా ప్రజా పాలననా అని ప్రశ్నించారు. వెంటనే మిగిలిన మహిళలకు కూడా ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరియు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# అక్రమ ఇసుక రవాణా జోరు...

## అధికారుల పర్యవేక్షణ ఎక్కడ...?

**రాయికల్, ఏప్రిల్ 2 (విజన్ ఆంధ్ర):**



రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామం నుంచి కోరుట్ల మండలంలోని పైడిమడుగు సరిహద్దుల వరకు విస్తరించిన పెద్దవాగు పరిసరాల్లో అక్రమ ఇసుక రవాణా నిత్యకృత్యంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుక తరలింపులు కొనసాగుతుండటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.సమాచారం ప్రకారం,కొంతమంది అక్రమార్కులు వాగు పరిసర ప్రాంతాల్లో జేసీబీల సహాయంతో తవ్వకాలు నిర్వహిస్తూ భారీగా ఇసుకను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ అక్రమ రవాణా ఇటిక్యాల,పైడిమడుగు,జోగన్‌పల్లి, మైతాపూర్ గ్రామాల మీదుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.గ్రామాల మధ్య రహదారులు ఇసుక వాహనాల రాకపోకలతో దెబ్బతింటుండటమే కాకుండా,ధూళి కాలుష్యం కూడా పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ల

**-పర్యావరణానికి ముప్పు**

వాగుల్లో అధికంగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల భూగర్భ జలాల స్థాయి పడిపోవడంతో పాటు,వాగుల సహజ ప్రవాహం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

**-అధికారుల నిర్లక్ష్యం?**

ఇంత పెద్దఎత్తున అక్రమ రవాణా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో మార్పు లేదని ఆరోపిస్తున్నారు.

**-చర్యలు తీసుకోవాలి**

అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాపై కఠిన చర్యలు తీసుకుని వాగులను రక్షించాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు



## సబ్‌సెంటర్‌లో ఎన్సీడీ స్క్రీనింగ్ శిబిరం

**విజన్ ఆంధ్ర, ముస్తాబాద్:**

ంరాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది సబ్ సెంటర్ పరిధిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఎన్సీడీ (అంటురాని వ్యాధులు) స్క్రీనింగ్ శిబిరం విజయవంతంగా నిర్వహించారు.డాక్టర్ అఫీజా (మీా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం (షుగర్), హృదయ సంబంధిత వ్యాధులు వంటి అంటురాని వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆరోగ్య పరిరక్షణ, జీవనశైలి మార్పులు, ముందస్తు జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ ఎంఎల్ హెచ్ పి డాక్టర్ రాజ్‌కుమార్, హెచ్‌ఈఓ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ శిబిరానికి మంచి స్పందన ఇచ్చి పెద్ద సంఖ్యలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య సిబ్బంది మాట్లాడుతూ, అంటురాని వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా వాటిని నియంత్రించవచ్చని, ప్రజలు నియమితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరం గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

---------------

## చెక్కపల్లి గ్రామం లో 'ప్రజా పాలన



**-- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం**

**-గ్రామసభలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగర్వాల్**

**వేములవాడ, 02 ఏప్రిల్ ( విజన్ ఆంధ్ర ):**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక గ్రామసభ గురువారంఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పూర్తి సేవాభావంతో పని చేస్తోందని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చి, వారి సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలాచర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ -- 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యమని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధి కారులు పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.



ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక

శుక్రవారం, 03.04. 2026

## కొండగట్టులో వైభవంగా 39వ గిరిప్రదక్షిణ

# 15 వేల మంది భక్తుల ప్రదక్షిణ





**మల్యాల, ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర):**
జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో గురువారం రోజున 39వ గిరిప్రదక్షిణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. సురేష్ మహారాజ్ ఆత్మారాం ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని, భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ గిరిప్రదక్షిణలో సుమారు 15,000 మంది భక్తులు పాల్గొన్నారు. కొండ చుట్టూ కాలినడకన ప్రదక్షిణ చేస్తూ భక్తులు చేసిన రామనామ స్మరణతో కొండగట్టు ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో హనుమాన్ దీక్షాపరులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు

**కొండగట్టులో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజలు**

మల్యాల మండలంలోని కొండగట్టు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి వారిని చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ అంజన్నను వేడుకున్నట్లు తెలిపారు. జయంతి ఉత్సవాల నేపథ్యంలో కొండగట్టుకు పోటెత్తిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.?ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు ఆలయ అధికారులు పాల్గొన్నారు.



## ముగిసిన 'ప్రజా పాలన

**-- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం**

**ముత్తారం,ఏప్రిల్ 2 (విజన్ ఆంధ్ర)**
ముత్తారం మండలంలోని 15 గ్రామపంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' గ్రామసభలు గురువారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు,అవసరాలు, అభివృద్ధి సూచనలను అధికారుల ముందుకు తీసుకువచ్చారు.గ్రామసభల సందర్భంగా తాగునీరు, రహదారులు,విద్య,వైద్య సేవలు, పింఛన్లు,రైతు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అధికారులు ప్రజల అభ్యర్థనలు స్వీకరించి,వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముత్తారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో సురేష్,గ్రామ సర్పంచ్ సుదాటి రవీందర్ రావు, కార్యదర్శి నరేష్,వార్డు సభ్యులు,వివిధ శాఖల అధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముత్యంపేట గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




**మల్యాల, ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర):**
మల్యాల మండల పరిధిలోని ముత్యంపేట గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు మరియు నాయకులు ఘనస్వాగతం పలికారు.గ్రామ సభలో భాగంగా గ్రామ అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రజల విన్నపాలను స్వీకరిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న, గ్రామ సర్పంచ్ దారం ఆదిరెడ్డి,మల్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ యువజన అధ్యక్షులు ముత్యం శంకర్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగులపేట సంజీవ్, వార్డ్ సభ్యులు,గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

## నూకపల్లిలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

**మల్యాల, ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర):**
మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో గురువారం నాడు స్థానిక ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ బి.ఎన్. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమం మొత్తం 40 రోజుల పాటు కొనసాగుతుందని ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు. శిక్షణ పొందాలనుకునే ఆసక్తి గల మహిళలు తమ ఆధార్ కార్డు జిరాక్స్ మరియు ఒక ఫోటోను గ్రామ ఉప సర్పంచ్ కనకట్ల ఉషలక్ష్మికి సమర్పించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఉషలక్ష్మి పర్యవేక్షణలో ఇతర శిక్షకులు (ట్రైనర్లు) అందుబాటులో ఉంటారని, ఎన్ రోల్ చేసుకున్న మహిళలందరూ క్రమం తప్పకుండా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.?ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెవులమాద్ది శ్రీనివాస్, ఉప సర్పంచ్ కనకట్ల ఉషలక్ష్మి, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.



## బాధితులకు న్యాయం చేస్తామని హామీ

**– చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో గ్రామ సభ**







**వేములవాడ అర్బన్ ఏప్రిల్ 02 ( విజన్ ఆంధ్ర)**
వేములవాడ అర్బన్ మండల పరిధిలోని చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా స్థానిక సర్పంచ్ కొలుగూరి కిరణ్మయి మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాలనీవాసుల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎంఎంఆర్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ గ్రామ సభలో ప్రత్యేకంగా చర్చించి, వాటిని ప్రణాళికలో చేర్చినట్లు ఆమె పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిహారం, ఇతర సాంకేతిక ఇబ్బందుల వల్ల ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల అధికారులు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో భాగంగా అందిన ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలిస్తామని వెల్లడించారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు

# పోతుగల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి గ్రామసభ నిర్వహణ

**విజన్ ఆంధ్ర, ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా: పోతుగల్ గ్రామంలో గురువారం ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు నివేదిక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. మండల ఎమ్మార్వో రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై సభను నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో "జయ జయహే తెలంగాణ" గేయాన్ని ఆలపించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, 2026 మార్చి 6 నుండి డిసెంబర్ 6 వరకు గ్రామ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు ప్రజా



పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో అమలైన పథకాలను లబ్ధిదారులకు చదివి వినిపించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, గృహజ్యోతి, సన్నబియ్యం, పింఛన్లు, ఇందిరా మహిళా శక్తి కింద మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కళ్యాణ లక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. సభలో గ్రామ సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి గ్రామసభకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోల కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ సెక్రటరీ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా విఓలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి సర్వాయి పాపన్న



**కొత్తపల్లి, ఏప్రిల్ 02 విజన్ ఆంధ్ర :**

బహుజన చక్రవర్తి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతిని పురస్కరించుకుని నగరం లోని రేకుర్తి బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుదగోని మాధవి - కృష్ణ గౌడ్ 19వ డివిజన్ కార్పొరేటర్, గుగ్గిళ్ళ జయశ్రీ - శ్రీనివాస్ 45వ డివిజన్ కార్పొరేటర్, స్థానిక నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాపన్న గౌడ్ స్మృత్యర్థం నివాళు లు అర్పించారు

## ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యం..!



**-సమస్యల పరిష్కారానికే గ్రామసభలు**
**-ప్రజా పాలన ప్రగతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..**

**కొత్తపల్లి ఏప్రిల్ 02, విజన్ ఆంధ్ర:**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సమస్యల పరిష్కారానికే గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం, రైతు భరోసా సన్న బియ్యం, పింఛన్లతో పాటు ఇతరత్రా పథకాలు లబ్ధి పొందుతున్న వారి వివరాలను గ్రామసభల్లో అధికారులు వెల్లడిస్తారని తెలిపారు. పథకాల అమలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావచ్చని జిల్లా సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజలంతా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. గ్రామసభ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కే మహేశ్వర్ కరీంనగర్ రూరల్ తహసిల్దార్ నర్సింగరావు, స్థానిక సర్పంచ్ సాయిళ్ళ శ్రావణి, పలువురు అధికారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి

**కరీంనగర్ (విజన్ ఆంధ్ర)**



పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సంద ర్భంగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ , బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , బీసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషి లక్ష్మి కలిసి కలెక్టర్ ఆడిటోరియంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న వర్ధంతిని ప్రభుత్వం అధికారం గా నిర్వహించడం అభినందనీయమని , పాపన్న పోరాట స్ఫూర్తిని కొనియాడారు 17వ శతాబ్దంలో బడుగు బలహీన వర్గాల ప్రజల పై జరిగే అణిచివేతకు తోపిడికి వ్యతిరేకంగా పోరాట చేసిన యోధుడు అని అన్నారు పాపన్న పోరాటాన్ని పూర్తిగా తీసుకొని ప్రస్తుత కాలంలో జరుగుతున్న దోపిడీ అవినీతిపై రాజ్యాంగ బద్ధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## అగ్రహారం దేవాలయాన్ని దర్శించిన ఎస్పీ



**వేములవాడ ఆర్బి, ఏప్రిల్ 2 (విజన్ ఆంధ్ర)**

చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా అగ్రహారంలోని హనుమాన్ దేవాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్వామివారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎస్పీకి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను ఎస్పీ మహేష్ బి. గితేకు అందజేశారు. దేవాలయంలో కొంతసేపు ప్రార్థనలు చేసి భక్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాస్, పట్టణ సి.ఐ వీరప్రసాద్, ఆర్.ఐ సురేష్, ఆర్.ఎస్.ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# అందరికీ అండగా ప్రజా ప్రభుత్వం

**-ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వేములవాడ ఆర్ సి,(విజన్ ఆంధ్ర)**

ప్రజా ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించగా, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామం గ్రామ సభ, వేములవాడ పట్టణంలోని 25 వార్డులో వార్డు సభలి లు నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద పలు యంత్రాలను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ పథకాల ద్వారా ఆదా అవుతున్న డబ్బులను తమ పిల్లల ఉన్నత చదువులకు, పొదుపు వైపు మళ్లిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు అండగా ఉన్నారని తెలిపారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలిచిందని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కోటి 15 లక్షల మంది రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు త్వరలో 5 లక్షల జీవిత బీమా కల్పించనున్నామని పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డు ఇస్తున్నామని వివరించారు. రూ.14, 600 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇటీవల సన్న బియ్యం పంపిణీ చేసి సంవత్సరం అయిన



సందర్భంగా అసెంబ్లీ లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నం బియ్యంతో భోజనం చేశారని గుర్తు చేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రకటించారు. ఎప్పుడు దరఖాస్తు చేసుకున్న నూతన రేషన్ కార్డు, కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం ఉందని చెప్పారు. రాజన్న ఆలయం నుంచి తిప్పాపూర్ బస్సు స్టాండ్ వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. కోరుట్ల బస్టాండ్ నుంచి చెక్కపల్లి బస్టాండ్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని గుర్తు చేసారు. మహాలక్ష్మి కింద ఆర్టీసీ బస్సుల్లో నిన్నటి వరకు మహిళలు ఉచిత బస్సు ప్రయాణాలు చేసి రూ. 10 వేల కోట్లు ఆదా చేశారని తెలిపారు.

**ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం**

వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో వంగ హారిక ఇందిరమ్మ ఇల్లు పూర్తి కాగా, గృహ ప్రవేశ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, జిల్లా పంచాయతి అధికారి షర్ఫుద్దీన్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చెక్కపెల్లి సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
శుక్రవారం, 03.04. 2026

# డంపింగ్ యార్డు స్థల మార్పిడికి కట్టుబడి ఉన్నాం

- హుజూరాబాద్ లో డంపింగ్ యార్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ కూడా వ్యతిరేకం, ఇప్పటికే మున్సిపల్ లో వ్యక్తిరేకంగా తీర్మానం చేశాం.
- పొలిటికల్ డైవర్షన్ కోసం కౌశిక్ రెడ్డి కొత్త నాటకం.
- హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్



**విజన్ ఆంధ్ర, హుజూరాబాద్ (ఏప్రిల్ 02)**

అసెంబ్లీ సాక్షిగా సీనియర్ శాసన సభ్యుడు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి వివక్ష చూపించడం దారుణమని,సీనియర్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుని పట్ల కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందనీ,వెంటనే కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ డిమాండ్ చేశారు.గురువారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా కౌశిక్ రెడ్డి అరాచకాలు ఎక్కువ అయ్యాయని తన ప్రవర్తన రాష్ట్రం మొత్తం చూసిందని,ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని,కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని కోరారు.గతంలో గవర్నర్ ను,కులాలను,మత విద్వేషాలు రెచ్చగొట్టేలాగా మాట్లాడడం, జర్నలిస్టులను, వ్యాపారస్తులను బెదిరించడం, కొట్టడం,రైతులను తిట్టడంలాంటి వల్ల నియోజ వర్గంలోని ప్రజలు ఇంకెంత కాలం భరించాలి అని తలలు పట్టుకుంటున్నారని,ప్రజలను ఇబ్బంది పెట్టే ఇలాంటి ఎమ్మెల్యే మాకు అవసరమా అని అనుకుంటున్నారని అన్నారు.ప్రభుత్వంలో ఉన్న మంత్రికి సంబంధించిన కంపెనీలపై సీబీ,సీఐడి విచారణ వేశామంటేనే మా పార్టీ ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని, కౌన్సిలర్లు, మండల, పట్టణ అధ్యక్షులు ,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**డంపింగ్ యార్డు వేరే చోట మార్చడానికి కట్టుబడి ఉన్నాం..**

డంప్ యార్డ్ పై ఇప్పటికే అధికారులకు పూర్తి సమాచారం అందించామని,డంపింగ్ యార్డ్ సమస్యపై త్వరలో అఖిలపక్ష నేతలతో సీఎం రేవంత్ రెడ్డినీ కలుస్తామని ప్రజలకు హాని చేసే ఏ కార్యక్రమం ప్రభుత్వం తీసుకోదని మరోసారి స్పష్టం చేశారు ప్రణవ్.హుజూరాబాద్ నియోజకవర్గ భవిష్యత్ మాకు ముఖ్యమని ఇప్పటికే మంత్రులకు ఈ విషయంపై పలుమార్లు పూర్తి నివేదిక అందజేశామని,దీనిపై రద్దుకు మా వంతు కృషి చేస్తామని అన్నారు.అయితే డంపింగ్ యార్డ్ విషయంలో కావాలని కౌశిక్ రెడ్డి తనపై ఉన్న సీబీ,సిఐడి కేసు నుండి డైవర్షన్ కోసం కొత్త డ్రామా మొదలు పెట్టాడని ఎద్దేవా చేశారు.విచారణ 4తేదీ ఉందని దానికి ముందు బంద్ పిలుపు ఇవ్వడం,విచారణ తర్వాత దీక్షలో కూర్చుంటానని అనడం పట్ల రాజకీయ లబ్ధి స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు.వరంగల్ మీటింగ్ లో చొప్పదండి మీటింగ్ లో సీఎం అనని మాటలను అన్నట్టుగా సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని అన్నారు.ఎంత సేపు తన స్వంత రాజకీయ లాభం కోసం ఆలోచించడం తప్ప ప్రజల కోసం కౌశిక్ రెడ్డి చేసింది ఏం లేదని అన్నారు.2022లోనే డంప్ యార్డ్ ప్రతిపాదన వచ్చినప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్ రెడ్డి అప్పుడు సైలెంట్ గా ఉండి ఇప్పుడు మాట్లాడడం,ధర్నా చేస్తా అనడం రాజకీయ కోణం లేదా అని ప్రశ్నించారు.ఎవరెన్ని చెప్పినా డంప్ యార్డ్ వేరే స్థలానికి మార్చడం కాంగ్రెస్ తోనే సాధ్యమని తెలిపారు.

**దళిత వ్యతిరేకి కౌశిక్ రెడ్డి..**

దళిత బంధు విషయంలో అప్పుడు ఎమ్మెల్సీ గా,విప్ గా ఉన్న కౌశిక్ రెడ్డి పూర్తి స్థాయిలో ఎందుకు దళిత బంధు ఇవ్వలేదని,చంపినోడే సంతాప సభ పెట్టినట్టు దళిత బంధు విషయంలో అబద్ధాలు మాట్లాడుతున్నాడని అసలు దళిత బంధు ఆపిందే కౌశిక్ రెడ్డి అని,ఆనాడే అందరికి ఇవ్వగా ఎవరు ఆపారని ప్రశ్నించారు.కేవలం ఓట్ల కోసం వారిని వాడుకున్నారని నిజంగా వారి అభ్యున్నతికి పాటు పడాలనే ఉద్దేశ్యం ఉంటే కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీ గా ఉన్నప్పుడే ఇచ్చే వాడని అన్నారు.మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత బంధు లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఇస్తున్నామని ఓట్ల కోసం కాకుండా వారి అభ్యున్నతికి పాటు పడుతున్నామని అన్నారు.

**చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం..**

రైతుల అవసరాల దృష్ట్యా సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనీయమని వారి కోరిక మేరకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని,దీనిపై ఇప్పటికే రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు.రైతులెవరూ అధైర్యపడవద్దని సూచించారు.



## పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

**విజన్ ఆంధ్ర, ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామంలో పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.గ్రామానికి చెందిన కరెడ్ల శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం సిద్ధిపేట 1టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సందర్భంగా, చీకోడ్ పంచాయతీ గ్రామ సిబ్బందికి సహాయం చేయాలని సర్పంచ్ కోరగా, ఆయన స్పందించి పారిశుధ్య కార్మికులకు నెలరోజులకు సరిపడే నిత్యావసర కిరాణా సరుకులు, మహిళలకు చీరలు, తువాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్మికులను శాలువాలతో సన్మానించారు. గ్రామాల్లో నిర్వహించే ప్రతి స్వచ్ఛ కార్యక్రమం వెనుక పారిశుధ్య కార్మికుల కృషి అమూల్యమని సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు పేర్కొన్నారు.ఈ సహాయం అందించిన శ్రీనివాస్ రెడ్డికి గ్రామ ప్రజలు, కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అస రంజిత్, వార్డు సభ్యులు కరెడ్ల మల్లారెడ్డి, తీర్మల్ రెడ్డి, నర్సారెడ్డి, రాజిరెడ్డి, యాదగిరి రెడ్డి, గ్రామ మహిళా సంఘాల నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు

## సేవాలాల్ తండాలో గ్రామసభ

**విజన్ ఆంధ్ర, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ సరిత రవి ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సరిత రవి మాట్లాడుతూ, ప్రభుత్వం ద్వారా గ్రామ ప్రజలకు అందించిన వివిధ సంక్షేమ పథకాల వివరాలను సభలో చదివి వినిపించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామ ప్రజలకు తెలియజేశారు..తాగునీరు, పారిశుధ్యం, రహదారుల మెరుగుదల వంటి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ సెక్రెటరీతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్

# సిరిసేడు గ్రామంలో ప్రత్యేక గ్రామసభ... ప్రభుత్వ పథకాలపై అవగాహన

- -100 రోజుల పాలనలో సైడ్ డ్రైనేజీ, బస్టాండ్, మరుగుదొడ్ల నిర్మాణం
- రానున్న రోజుల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల - కుమార్

**విజన్ ఆంధ్ర,ఇల్లందకుంట (ఏప్రిల్ 02)**

ఇల్లందకుంట మండలం సిరిసేడు లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రేణికుంట్ల శ్యామల - కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ అనే గీతం ఆలపించి తదుపరి ముఖ్యమంత్రి




సందేశం గ్రామస్తులకు చూపించారు.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల పనుల వివరాలు తెలిపారు. అనంతరం సర్పంచ్ రేణికుంట్ల శ్యామల - కుమార్ మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూం.గృహజ్యోతి, చేయుత పెన్షన్స్, మహాలక్ష్మీ పథకములో భాగంగా గ్యాస్ సిలెండర్ సబ్సిడి, తడి - పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరి శుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో మంచినీటిని వృదా చేయకుండా చూడడం ఇతర అంశాలపై సూచించారు.

**100 రోజుల పాలనలో సైడ్ డ్రైనేజీ, బస్టాండ్, వాష్ రూమ్స్ నిర్మాణం :**

సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన 100 రోజులలో గ్రామ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నామని శ్యామల తెలిపారు. ఎస్సీ కాలనీలో సైడ్ డ్రైనేజీ గత 25 సంవత్సరాలుగా పరిష్కారం కానటువంటి డ్రైనేజీని పూర్తిచేశామన్నారు.. ఎస్సీ కాలనీలో ఉన్న ప్రైమరీ స్కూల్ కి ప్రహరీ గోడ నిర్మించామని తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా సిరిసేడు కి చెందిన గన్ను సంపత్ సహకారంతో బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.. ఆదివారం వారసంత కు వచ్చేటువంటి మహిళలను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్ లో మరుగుదొడ్ల నిర్మాణం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రతి నిరుపేదకు అర్హునికి అందే విధంగా పారదర్శకంగా పరిపాలన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు రెడ్డి సారంగం అమ్మ గోని రమేష్ వరలక్ష్మి కాశమల శ్రీలేఖ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక

శుక్రవారం, 03.04. 2026

## 6 గ్యారెంటీలు అమలు చేయడంలో ..

# కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

**కెసిఆర్ పథకాలు కొనసాగించాలి**
**- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**




విజన్ ఆంధ్ర, హుజురాబాద్ (ఏప్రిల్ 02)

శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల హామీని అమలు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. హుజూరాబాద్ మండలం రాజపల్లి, సిర్సపల్లి గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలకు సర్పంచ్ లు కటుకూరి మల్లా రెడ్డి, పోల్సాని రామారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు పరచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అలవి కాని పనులు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు విక్రయించిన ధాన్యానికి బోనస్ చెల్లించడంలో తాత్సారం చేస్తోందని అన్నారు. రైతులకు ఒకే విడతలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా కెసిఆర్ ప్రభుత్వం అందించిన ఆర్థిక తోడ్పాటుకు అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీని రేవంత్ సర్కార్ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. వృద్ధులకు 4 వేలు, వికలాంగులకు 6 వేలు పెంచుతామన్న పెన్షన్ గుర్తుకు లేదా అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. కనీసం రైతాంగానికి యూరియా అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేసి శిద్ధశుద్ధి చాటుకోవాలని సూచించారు. అలాగే హుజూరాబాద్ సమీపంలో చేపట్ట తలపెట్టిన డంపింగ్ యార్డు నిర్మాణం వల్ల వాయు, జల కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటు తో వెలువడే విష వాయువుల ప్రభావం వల్ల శ్వాస కోస, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల సోకుతాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో హుజూరాబాద్ లో డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టకుండ అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ నెల 3 న హుజూరాబాద్ పట్టణ బంద్ కు పిలుపునిచ్చిన తాను 7, 8 వ తేదీల్లో 48 గంటల పాటు నిరసన దీక్షలో పాల్గొంటానని చెప్పారు. డంపింగ్ యార్డు రద్దు అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని, పార్టీలకు అతీతంగా ప్రజలు స్వచ్ఛందంగా కలసి రావాలని పిలుపునిచ్చారు.గ్రామ సభల్లో డీఆర్డీఏ పీవో శ్రీధర్,ఆర్డీవో రమేష్ బాబు, ఎంపీడీఓ సునీత తదితర గ్రామ పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

## సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# హనుమాన్ భక్తులకు పులిహోర, స్వీట్,అరటిపండ్లు వాటర్ బాటిల్ పంపిణీ కార్యక్రమం



వేములవాడ, ఏప్రిల్ 02 (విజన్ ఆంధ్ర ):

వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం హనుమాన్ దేవాలయం ఆవరణలో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ భక్తులకు అల్పాహారం పులిహోర, స్వీట్,అరటి పండ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు 22 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఇప్పపూల మమత - అజయ్, మస్తాన్, ట్రస్టు నిర్వాహకులు పిల్లి బాబురావు చేతుల మీదుగా హనుమాన్ స్వాములకు, భక్తులకు అరటి పండ్లు పులిహోర పంపిణీ చేయడం జరిగింది. హనుమాన్ జయంతి కి వచ్చే భక్తులకూ ఎటువంటి ఇబ్బంది కలగకూడదని ఉద్దేశం తో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని మీ అందరి సహాయ సహకారాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో చేపడతామని సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎద్దండీ రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఇప్పపూల మమత - అజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మస్తాన్, సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబు రావు,సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏద్దండీ రాజు,కోశాధికారి దూలం భూమేష్ గౌడ్,బొడగేరాజు,వేముల సతీష్, హరిప్రసాద్, గోంటి నవీన్, రాచకొండరాజు,విద్య శ్రీ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు

## మద్దికుంటలో గ్రామసభ

## ప్రగతి నివేదికపై విస్తృత చర్చలు

**విజన్ ఆంధ్ర, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దోనుకుల రాజమల్లవ్వ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగమైన 99 రోజుల ప్రణాళిక కింద ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సందేశాన్ని కూడా ప్రజలకు వివరించారు.గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సభలో చర్చలు జరిపి, గ్రామంలో చేపట్టాల్సిన పనులపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, అంతర్గత రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాట్లు వంటి సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్పెషల్ ఆఫీసర్, గ్రామ సెక్రెటరీతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు తెలిపారు



## నేడు ముత్తారం మండలంలో

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ముత్తారం,ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీ దుద్దిల శ్రీపాద రావు 27వ వర్ధంతి సందర్భంగా ఏప్రిల్ 2026,3,4, తేదీలలో ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్ల బాలాజీ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు,దుద్దిల్ల శీను బాబు ఆదేశాల మేరకు శ్రీపాద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరం కార్పొరేట్ స్థాయిలో నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ శిబిరంలో కంటి సంబంధిత పరీక్షలు ఉచితంగా నిర్వహించబడటంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడతాయని,కంటి అద్దాలు కూడా పంపిణీ చేయబడతాయని తెలిపారు.ముత్తారం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కంటి ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొడ్ల బాలాజీ కోరారు.

-------------------

## గన్నవానిపల్లెలో గ్రామసభ

## -- ప్రగతి నివేదికపై విస్తృత చర్చలు




**విజన్ ఆంధ్ర, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గన్నవానిపల్లె గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రేసు రఘు ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ రేసు రఘు మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగమైన 99 రోజుల ప్రణాళిక కింద ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సందేశాన్ని కూడా ప్రజలకు వివరించారు.గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సభలో చర్చలు జరిపి, గ్రామంలో చేపట్టాల్సిన పనులపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, అంతర్గత రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాట్లు వంటి సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్పెషల్ ఆఫీసర్, గ్రామ సెక్రెటరీతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు తెలిపారు

-------------

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
శుక్రవారం, 03.04. 2026

# గ్రామ సభలో గ్రామస్తులు లేక వెలవెల

**- అభివృద్ధి పనులపై చర్చ ...**
**- సెస్ ను ఎన్పిడీసీఎల్ లో విలీనం చేయొద్దు - గ్రామస్తులు...**



**రుద్రంగి, ఏప్రిల్ 2 (విజన్ ఆంధ్ర):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై అధికారులు గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు రెండు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిని సంక్షేమ కార్యక్రమాలు పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గ్రామస్తులు సెస్ ను ఎన్పిడీసీఎల్ లో విలీనం చేయొద్దని విలీనం జరిగితే జిల్లాలో జరిగే ప్రత్యేక విద్యుత్ రాయితీలు తగ్గిపోతాయని, అటు చేనేత రంగానికి, వ్యవసాయానికి తీరని ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. సెస్ స్వయం ప్రతిపత్తిని కాపాడాలని గ్రామస్తులు తీర్మానం చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామసభలో గ్రామస్తులు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, అక్రమ నిర్మాణాలను తొలగించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఇందీర చౌక్ నుండి హనుమాన్ గుడి వద్దకు వెళ్లే ప్రధాన రహదారిలో నెలల తరబడి ఇసుక మరియు కంకర డంపులు ఉండటం అలాగే పనులు చేయక వదిలేయడంతో ప్రయాణికులకు, రైతులకు ,విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అక్కడి నుండి ఇసుక డంపును తొలగించాలన్నారు. దేగావత్ తండా గ్రామంలో వరల్డ్ స్టేడియం ఇన్నోవేషన్ లీగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామానికి చెందిన యువకుడు సురేష్ అండర్ 17 విభాగం బ్యాట్మెంటన్ డబల్ లో పాల్గొని కాంస్య పథకం సాధించడంతో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం ,అంతర్గత రహదారుల అభివృద్ధి, సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయా గ్రామాల సర్పంచులు పిలుపునిచ్చారు.రుద్రంగి గ్రామసభలో రెవెన్యూ శాఖ అధికారులు లేకపోవడంతో రెవెన్యూ కు సంబంధించిన సమస్యలను అడిగేందుకు అవకాశం లేక పోవడంతో గ్రామస్తులు ఆసహనం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక గ్రామసభకు అధికారులు మాత్రమే హాజరై గ్రామస్తులు హాజరు కాకపోవడం తో గ్రామ సభ వెలవెలబోయింది. సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రామస్తులు లేకపోవడం ఏంటని పలువురు చర్చించు కుంటున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు, స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు




# కట్లకుంట గ్రామంలో గ్రామ సభ నిర్వాహణ

**మేడిపల్లి / భీమారం, ఏప్రిల్ 2 (విజన్ ఆంధ్ర) :**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కట్లకుంట గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగినది. ఈ గ్రామ సభలో సర్పంచ్ శ్రీమతి గోకల సుమలత అధ్యక్షతన, ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి చౌడారపు గంగాధర్, మండల ప్రత్యేక అధికారి సురేందర్ కుమార్, గ్రామంలోని అభివృద్ధి పనుల్లో పాలుపంచుకుంటున్న వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో మార్చ్ 6 నుండి 15 వరకు గ్రామంలో జరిగిన కార్యక్రమాల గురించి 99 రోజుల ప్రణాళిక గురించి తెలియజేస్తూ వివిధ శాఖల అభివృద్ధి అధికారులు నివేదికలు చదివి వినిపించడం జరిగినది. అనంతరం ఎంపీడీవో చౌడారపు గంగాధర్ మాట్లాడుతూ.. అల్పార పథకం ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం గురించి, మధ్యాహ్న భోజన పథకం ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ విద్య వరకు పొడిగింపు, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగులైన విద్యార్థులకు మోటరైజుడు వాహనాలు వివిధ పంటల వైవిధ్యాకరణ ప్రకృతి సేంద్రియ వ్యవసాయం గురించి తెలుపుతూ గ్రామంలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించుటకు పోస్టర్లను విడుదల చేస్తూ సభకు హాజరైన అందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఈ హౌసింగ్ డి. వందన, పంచాయతీ కార్యదర్శి ఎన్. ఆదిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు పాదయాత్రికులకు 'కందుల వినోద్' సేవలు

**మల్యాల, ఏప్రిల్ 02(విజన్ ఆంధ్ర):**
మల్యాల మండలం తక్కలపల్లి గ్రామంలో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా కందుల వినోద్ సేవా ఆధ్వర్యంలో కే. వినోద్ గురు వారం పాదయాత్ర గా ఎండ లో ఎండ త్రివత్తను దృష్టిలో ఉంచుకొని భక్తులకు కొండగట్టు వెళు తున్న హనుమాన్ భక్తులకు పండ్లు, వాటర్ బాటిల్లను అందించారు. స్వామివారి దీక్షలో ఉన్న భక్తులకు సేవ చేయడం పునర్జన్మ సుకృతమని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తానని తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో కందుల వినోద్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు.ఉత్తమ్ గంగాధర్,మరియు నిచ్చిత్, ప్రణీత్, అరుణ్ కుమార్ ,చందు, దొనకొండ రమేష్, డి. తిరుపతి. నర్సయ్య తదితరులు మరియు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు



**కరీంనగర్, (విజన్ ఆంధ్ర) :**
కరీంనగర్‌లో వాసవి వనిత వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో భగత్ నగర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.ఈ చలివేంద్రానికి నూనె వాణి--వంశీకృష్ణ, కేశెట్టి విశాల నాగరాజు దాతలుగా సహకరించగా, ప్రతిరోజూ మంచినీటి సరఫరాను మోటూరి శోభ--దేవేందర్ చేపట్టారు.క్లబ్ అధ్యక్షురాలు గంప హరిణి, ప్రధాన కార్యదర్శి కేశెట్టి విశాలతో పాటు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

